కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 50, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 31, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 8, క్యారెట్ 19, దొండ 50, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 20, బీట్‌రూట్ 18, ఉల్లిగడ్డ 28, ఆలుగడ్డ 21, చామగడ్డ 55, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

పలువురికి సత్కారం

లాలాపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు సోమవారం శాంతినగర్‌లో ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకురాలు ముత్యాల గీతాదయాకర్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో దళిత బహుజన నాయకుడు మంజరీ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ ఆంజనేయులు ముఖ్యతిధిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి, సామాజిక పరివర్తకురాలు సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన పలువురిని సత్కరించారు.

కరాటే కిడ్‌ను అభినందించిన ఎమ్మెల్యే


దీక్షితను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

అడ్డగుట్ట: విశాఖపట్నంలో నిర్వహించిన రెండవ అంతర్జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ -2025లో మొదటి స్థానం సాధించిన తుకారాంగేట్‌కు చెందిన చిన్నారి దీక్షితను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అభినందించారు. ఇటీవల విశాఖపట్నంలోని పోర్ట్ రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో రెండవ అంతర్జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ -2025 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న తుకారాంగేట్‌కు చెందిన దీక్షిత మొదటి స్థానం సాధించింది. సోమవారం ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను తుకారాంగేట్‌లోని ఆయన నివాసంలో కలిశారు. దీక్షిత సాధించిన విజయాలు ఎంతో గర్వకారణమని ఎమ్మెల్యే గణేష్ పేర్కొన్నారు.

మంద కృష్ణమాదిగ వ్యాఖ్యలు అర్థరహితం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల భర్తీ పై మంద కృష్ణమాదిగ చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితమని మాల విద్యార్థి, యువజన సంఘం నేతలు పేర్కొన్నారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాల యూత్ ఫెడరేషన్ ఛైర్మన్ మందాల భాస్కర్, మాల స్టూడెంట్ జేఏసీ అధ్యక్షులు మాదాసు రాహుల్, అంసా ఓయూ అధ్యక్షులు నామ సైదులు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ తర్వతే గ్రూప్స్ ఉద్యోగాలు భర్తీ చేయాలనడం సరికాదన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం పై మాలలకు జరిగిన అన్యాయం పై మాల ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు మాట్లాడాలని డిమాండ్ చేశారు.

దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలి


విద్యార్థుల నృత్య ప్రదర్శన

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలని యూరో నర్చర్ స్కూల్ కరస్పాండెంట్ థామస్ ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్తేర్ విద్యావతి, ఉపాధ్యాయులు మణి, సరిత, ఇమ్రానా, లక్ష్మి, కళ్యాణి, సంధ్యా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యసేవలపై ప్రజల్లో నమ్మకం పెంచాలి

ముషీరాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందే వైద్య సేవలపై ప్రజల్లో మరింత నమ్మకం పెరిగేలా ఆశావర్కర్లు కృషి చేయాలని జిల్లా వైద్యశాఖ అధికారి డా. వెంకటి సూచించారు. సోమవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో ఆశావర్కర్లు, వైద్య సిబ్బందితో వైద్య సేవలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి గర్భిణులు, అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించేలా కృషి చేయాలన్నారు. ఆస్పత్రిలో ఓపీ సేవలను పెంచాలని సూచించారు. భోలక్‌పూర్ యూపీహెచ్‌సీకి త్వరలో కొత్త డాక్టర్‌ను నియమిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి, ఎస్‌పీహెచ్‌వోలు డా. శ్రీకాంత్, డా. సాయిబాబా, పీహెచ్‌ఎల్ స్పెల్లీస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారాయ్.. పనులు ఆగిపోయాయ్..!

గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనా జాడలేని అభివృద్ధి.. • నిధులు వెనక్కి...కథ మళ్లీ మొదటికే..

సనత్‌నగర్: అధికారులు ఆ పనులకు ప్రతిపాదనలు చేయడమే కాదు..అంచనాలు రూపొందించి నిధులు కూడా మంజూరు చేశారు. కొన్ని పనులను కాంట్రాక్టర్లకు కూడా అప్పగించారు. మరికొన్నింటికి కొబ్బరికాయలు కొట్టి లాంఛనంగా ప్రారంభించారు. కానీ ఆ పనులు జాడ దేవుడెరుగు..విడుదలైన నిధులు కూడా వెనక్కి వెళ్లిపోయి కథ మళ్లీ మొదటికొచ్చింది. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధి కిందికి వచ్చే బేగంపేట డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంజూరైన అభివృద్ధి పనులు అటకెక్కాయి. ఫలితంగా ఆయా అభివృద్ధి పనులు పూర్తయితే ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఆశించిన ప్రజలకు ఆశాభంగమే ఎదురైంది.


గతంలో రూ.40 లక్షలు మంజూరై పనులకు నోచుకోని కమ్యూనిటీ హాల్ స్థలం ఇదే..

కమ్యూనిటీ హాల్ కథ కంచికేనా..

బేగంపేట శ్యాంలాల్‌బిల్డింగ్స్ తాతాచారికాలనీ గ్రౌండ్‌లో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని తలపెట్టారు. ఇందుకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రూ.40 లక్షల మేర నిధులు కూడా మంజూరు చేయించారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇంతవరకు ఇసుమంతైనా పనులు ముందుకు కదల్లేదు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల ముందు 2023లో ఈ పనులు ప్రారంభం కాగా ఇంతలో ఎన్నికల కోడ్ రావడం, ఆ తర్వాత ప్రభుత్వం మారిపోవడంతో అధికారులకు కమ్యూనిటీహాల్ ఊసే లేకుండాపోయింది. పోనీ ఇప్పుడైనా ఆ పనులు చేపడదామంటే ఆ నిధులు ఉన్నాయా? లేదా? అంటే ప్రశ్నార్థకమే. దీంతో ఇక్కడివాసుల కమ్యూనిటీహాల్ కథ కంచికేనా? అన్న అనుమానం కలుగుతోంది.

రోడ్ల పరిస్థితీ అంతే..

గత ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినా ఆ పనులు ఇంతవరకు పట్టాలెక్కలేదు సరికదా..ఆ పనుల ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. మరోసారి అంచనాలు రూపొందించి నిధులు మంజూరు చేస్తే గానీ ఆ అభివృద్ధి పనులు ముందుకు కదిలే పరిస్థితి లేదు. ప్రధానంగా ప్రకాష్‌నగర్‌లో రూ.60 లక్షల వ్యయంతో చేపట్టిన వెల్కిన్‌పార్కు రోడ్డు, రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన మయూరిమార్గ్ అప్రోచ్ రోడ్డు, రూ.18 లక్షలతో చేపట్టిన శ్యాంలాల్‌బిల్డింగ్ ఏటీఎం దగ్గర నుంచి చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు ఏమాత్రం ముందుకుకదల్లేదు. అదేమంటే గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో తమకేంటి ధోరణి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా మరోసారి అంచనాలు రూపొందించి నిధులు మంజూరు చేసి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించే యోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. పోనీ అదైనా ఎప్పుడు చేస్తారో కూడా తెలియని పరిస్థితి.

కమ్యూనిటీహాల్ నిర్మాణం చేపట్టాలి



తాతాచారికాలనీ గ్రౌండ్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.40 లక్షలు గతంలో మంజూరు చేశారు. గత ప్రభుత్వంలో మంజూరైన పనుల విషయంలో నిర్లక్ష్యం కనబరుస్తుండడం సరికాదు. అభివృద్ధి అంటే ప్రజలకు ఇబ్బందులు తొలగించేలా ఉండాలి కానీ, గత ప్రభుత్వంలో మంజూరయ్యాయన్న సాకుతో పట్టించుకోకుండా వదిలేయడం ఎంతవరకు భావ్యం. కమ్యూనిటీహాల్ అందుబాటులోకి వస్తే ఎన్నో కాలనీల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే గతంలో మంజూరై చేపట్టకుండా వదిలేసిన రోడ్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభించాలి.

– సురేష్‌యాదవ్, బీఆర్‌ఎస్ బేగంపేట డివిజన్ అధ్యక్షుడు,

నేడు ఆరెకటికల ఆత్మీయ సమ్మేళనం

కాచిగూడ: తెలంగాణ ఆరే కటిక సంఘం నేత చెకోలేకార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆరెకటికల ఆత్మీయ సమ్మేళనానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ ఆరెకటిక సేవా సమితి అధ్యక్షుడు కళ్యాణ్‌కార్ ఈశ్వర్ చౌదరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీ మంగళవారం సాయంత్రం 4గంటలకు రవీంద్రభారతిలో జరిగే ఆరెకటికల ఆత్మీయ సమ్మేళనంలో ఆరెకటికలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మధునాపంతుల సత్యనారాయణశాస్త్రికి నివాళి

చిక్కడపల్లి: తెలుగు సాహిత్యంలో పేరున్న కవులలో ప్రముఖుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి అని టీపీహెచ్‌సీ పూర్వ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్తా అన్నారు. త్యాగరాయ గానసభలో ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా సోమవారం సాహిత్యవేత్త మధునా పంతుల సత్యనారాయణశాస్త్రి సంస్మరణ సభ జరిగింది. కొల్లేటి దామోదర్‌గుప్తా మాట్లాడుతూ... ఆధునిక సంప్రదాయ పద్యకవులలో మధునా పంతుల సత్యనారాయణశాస్త్రి ఒకరని అన్నారు. ఆయన రచించిన ఆంధ్ర పురాణం కావ్యంలో విశ్వనాథ వారి కవితా ధార, కరుణశ్రీ వంటి కవుల శైలి కనిపిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త తంగిరాల చక్రవర్తి, గాయకుడు ఘంటసాల వెంకటేశ్వర్‌రావు, గాయని గరిమెళ్ళ సీత, కళా వీఎస్ జనార్ధనామూర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీలక్ష్మీ సుదర్శన నారసింహ హోమం


శ్రీలక్ష్మీ సుదర్శన నారసింహ హోమంలో భక్తులు

సనత్‌నగర్: హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలో శ్రీమదలర్మేల్ మంగా పద్మావతీ సమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీలక్ష్మీ సుదర్శన నారసింహ హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అశేష జన సందోహం నడుమ వేద మంత్రాల మంత్రోచ్చారణలతో హోమం కొనసాగింది. ఉత్సవాలను పురస్కరించుకుని స్వామి వారికి ఉదయం సుప్రభాతసేవ, నిత్య ఆరాధన, సేవాకాలం, బాలభోగం, తీర్థప్రసాద గోష్ఠి, చతుస్థానార్చనలు, మూలమంత్ర హోమములు తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహించారు. ఈఓ సత్యనారాయణనాయుడు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

వైభవంగా డోపోత్సవం

సనత్‌నగర్: ఈఎస్ఐ సమీపంలోని శ్రీవిజయలక్ష్మీ దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సనత్‌నగర్ మోడల్‌కాలనీలో సోమవారం సాయంత్రం డోపోత్సవ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విజయలక్ష్మి ఆలయం నుంచి స్వామి వారిని ఊరేగింపుగా సుందర్‌నగర్ మీదుగా మోడల్‌కాలనీకి తీసుకువచ్చారు. కాలనీ మహిళలు దీపాలు, కోలాట ప్రదర్శనలతో స్వామి వారి ఊరేగింపునకు స్వాగతం పలికారు. అనంతరం దేవాలయానికి అర్చక, సిబ్బంది నిర్వహించిన భక్తిపూర్వక నాటక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.భక్తులు ఇబ్బంది పడకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.


స్వామివారికి హారతులు ఇస్తున్న బాలికలు..


మోడల్‌కాలనీలో స్వామివారి శోభాయాత్ర

మహిళలు లేని లోకాన్ని ఊహించలేం


సన్మాన గ్రహీతలతో సి.రామకృష్ణ, వంశీ రామరాజు, లంకా లక్ష్మీనారాయణ

చిక్కడపల్లి: మహిళలు లేని లోకాన్ని ఊహించలేమని వక్తలు పేర్కొన్నారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నవరత్న మహిళా పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రంగాల నుంచి ఎంపిక చేసిన మహిళలు బెజవాడ భువనేశ్వరి, శైలజామిత్ర, పాలపర్తి సంధ్యారాణి, పింగళి చంద్రిక, గిరిజ, రేవల్లి, సుధామయి, యం.లలితారాజ్, అర్చన గుత్తి, మృదుల కడియాలకు దక్షిణ మధ్యరైల్వే పూర్వ జీఎం సి.రామకృష్ణ గౌరవ అతిథిగా పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. తొలుత వర్ధమాన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖులు వంశీ రామరాజు, లంకా లక్ష్మీనారాయణ, పులివర్తి కృష్ణమూర్తి, రామరాజు, లక్ష్మీశ్రీనివాస్, నిర్మలాప్రభాకర్, జయంతిరెడ్డి, జి.వెంకటరెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి


చిలకలగూడ గాంధీ చౌక్ వద్ద సావిత్రిపూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

చిలకలగూడ: సంఘ సంస్కర్త, అభ్యుదయ మానవతావాది సావిత్రిబాయిపూలే ఆశలు, ఆశయాల సాధనకు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ గాంధీ చౌక్ వద్ద బీజేపీ నాయకుడు ఆకారం రమేష్ నేతృత్వంలో సావిత్రిబాయి పూలే వర్థంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి పాల్గొన్నారు.

ఓయూలో..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో సావిత్రిబాయిపూలే వర్థంతిని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట టీవీయూవీ, టీడీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పలువురు విద్యార్థి నేతలు సావిత్రి చిత్రపటం వద్ద నివాళులర్పించి ఆమె చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో టీవీయూవీ ఛైర్మన్ కంచర్ల బద్రీ, టీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు విజయ్‌నాయక్, అంసా ఓయూ అధ్యక్షులు నామ సైదులు పాల్గొన్నారు.


సావిత్రిబాయికి నివాళులర్పిస్తున్న అర్పిస్తున్న విద్యార్థులు

వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ హైడ్రాకు బదిలీ


బదిలీపై వెళ్తున్న ఇన్‌స్పెక్టర్ సైదులును సత్కరిస్తున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి

బౌద్ధనగర్: వారాసిగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సైదులు హైడ్రాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ సైదులుకు సిబ్బంది వీడ్కోలు పలికారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ జైపాల్‌రెడ్డి సైదులును శాలువాతో సత్కరించారు. నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని ఈ సందర్భంగా ఏసీపీ జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో వారాసిగూడ డీఐ రమేష్ గౌడ్, చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, ఎస్ఐలు సుధాకర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహాల మాయం కేసు.. పోలీసుల అదుపులో ఇద్దరు

అమీర్‌పేట: ఎస్ఆర్‌నగర్ సమీపంలోని గురుమూర్తి నగర్‌లో శ్రీ వినాయక ఆలయంలో దొంగతనానికి పాల్పడ్డ నిందితులను ఎస్ఆర్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గర్భగుడిలో శివుడు, పార్వతి పంచలోహ విగ్రహాలు కనిపించలేదంటూ ఆలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లోని సీసీ పుటేజీలను పరిశీలించి అనుమానితులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దర్శనం కోసం వచ్చి దొంగతనానికి పాల్పడ్డట్లు తెలుస్తోంది.

బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుడి అరెస్ట్

అమీర్‌పేట: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఓ యువకుడిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. సనత్‌నగర్ డివిజన్ సుభాష్‌నగర్‌కు చెందిన కె.ఈశ్వర్ (31) శ్యామల కుంట పార్కు వద్ద గల ఓ టీస్టాల్‌లో బెట్టింగ్ చేస్తుండగా వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈశ్వర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. యాప్ ద్వారా బెట్టింగ్‌కు పాల్పడినట్లు తెలిపారు.

దాసోజు శ్రవణ్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

ముషీరాబాద్: బీఆర్‌ఎస్ తరపున ఎమ్మెల్సీగా నామినేషన్ వేసిన దాసోజు శ్రవణ్‌కుమార్‌ను ఎమ్మెల్యే ముఠా గోపాల్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, గాంధీనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా తదితరులున్నారు.

చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టకండి

ఎమ్మెల్యే తలసాని


ఫుట్‌పాత్ వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఫుట్‌పాత్ వ్యాపారాలు చేసుకుంటూ పొట్టచేసుకునే నిరుపేదలను ఇబ్బందులు పెట్టడం మానుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. రాంగోపాల్‌పేట, నల్లగుట్ట తదితర ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకుంటున్న వారు సోమవారం ఎమ్మెల్యే తలసానినివెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన కార్యాలయంలో కలిసి సమస్యను వివరించారు. ఎన్నో సంవత్సరాల నుంచి అక్కడే వ్యాపారం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఇప్పుడు అద్దెలు పెంచుతామని అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి తప్ప, అసలు వ్యాపారాలే చేసుకోకుండా ప్రయత్నించడం తగదన్నారు. అసలే వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో జీహెచ్ఎంసీ అధికారులు షాపుల అద్దెలను పెంచాలని తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి, చిరు వ్యాపారులు హలీం, మన్మంతరావు, ఇమ్రాన్, నర్సింగ్‌రావు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'గ్లకోమా' సదస్సును సద్వినియోగం చేసుకోవాలి


సదస్సు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎన్‌పీసీబీ జాయింట్ డైరెక్టర్ మోతీలాల్ నాయక్

కంటోన్మెంట్: పుష్పగిరి ఆసుపత్రి ఆధ్వర్యంలో చేపట్టిన గ్లకోమా అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని నేషనల్ ప్రోగామ్ ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ (ఎన్‌పీసీబీ) జాయింట్ డైరెక్టర్ మోతీలాల్ నాయక్ అన్నారు. మారేడుపల్లిలోని పుష్పగిరి ఆసుపత్రిలో మార్చి 10 నుంచి 15 వరకు గ్లకోమా అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్లకోమా కారణంగా అంధత్వాన్ని నివారించడానికి పుష్పగిరి కంటి ఆసుపత్రి నిర్వాహకులు అవగాహన కల్పించి, చికిత్స అందిచడం అభినందనీయం అని అన్నారు. కార్యక్రమంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి చైర్మన్ శ్రీ గోవింద హరీ, గ్లాకోమా స్పెషలిస్ట్ డాక్టర్ షబానా భారతి తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలి


ఎండీ గౌతంకు వినతి పత్రం సమర్పిస్తున్న అహ్మద్‌గూడ డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: అహ్మద్‌గూడలోని డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతంకు సోమవారం అహ్మద్‌గూడ డబుల్‌బెడ్‌రూం కమిటీ అధ్యక్షుడు వి.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. గత ప్రభుత్వం ఐదేళ్ల క్రితం కట్టించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో సరైన వసతులు లేవన్నారు. అందువల్ల అక్కడ నివాసించేందుకు ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. 9వ అంతస్తుపైన ఫ్లోరింగ్ పై కప్పు పెచ్చులు ఊడిపోతున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా వాటర్ లీకేజీ అవుతోందని వినతి పత్రంలో తెలిపారు. మినరల్‌వాటర్ వద్ద గ్రిల్స్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదం జరిగే ఆస్కారం ఉందన్నారు. సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో వై. పరుశురాములు, ఝాన్సీ, సుధీర్, విష్ణు, నాగరాజు తదితరులు ఉన్నారు.

ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన

వెంగళరావునగర్: డివిజన్‌లోని సమస్యలను సాధ్యమైనంత త్వరలోనే పరిష్కరిస్తామని జీహెచ్ఎంసీ సర్కిల్-19 ఉప కమిషనర్ జకియా సుల్తానా అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి స్పందన లభించింది. ముఖ్యంగా మధురానగర్ కాలనీకి చెందిన అసోసియేషన్ నేతలు కాలనీలోని సమస్యలను తెలియజేశారు. కాలనీలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఫుత్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించుకున్నారని, దాంతో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. వీధి దీపాలు వెలగడం లేదని అనేకమార్లు సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. కాలనీవాసులు కొంతమంది ప్రధాన వీధుల్లో కుక్కలకు భోజనం ఏర్పాటు చేయడం వల్ల మహిళలు, ద్విచక్ర వాహనదారులు, వృద్ధులపై కుక్కలు దాడులు చేస్తున్నాయని పేర్కొన్నారు. దాదాపు 60 వరకు హాస్టల్స్ ఉన్నాయని, వీటిలో అనేక మందికి కనీసం లైసెన్స్ కూడా లేవని, సంబంధిత శాఖ అధికారులకు ఇవన్నీ తెలిసి కూడా పట్టించుకోవడం లేదని డిప్యూటీ కమిషనర్‌కు తెలిపారు. రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ డివిజన్లలో అనుమతులు లేని నిర్మాణాలు పెరిగిపోతున్నాయని, టౌన్‌ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయా డివిజన్లకు చెందిన నేతలు పేర్కొన్నారు. పన్ను వసూళ్ల వ్యవహారంలో అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని రహమత్‌నగర్, ఎర్రగడ్డ ప్రాంత ప్రజలు ఆరోపించారు. స్పందించిన ఉప కమిషనర్ అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూస్తామన్నారు. ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నేతలు కోడె సాంబశివరావు, హనుమంతరావు, గంగారెడ్డి, రాజేంద్రప్రసాద్‌తో పాటు ఇంజినీరింగ్ విభాగం డీఈఈ రామచంద్రరాజు, ఏఎంసీలు బాల్‌రాజ్, యాదగిరి, న్యాక్ ఇంజినీర్ మౌనిక శర్మ, శానిటేషన్ సూపర్‌వైజర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.